మది నిండా మువ్వన్నెల పతాకం

వేడుకగా గణతంత్ర దినోత్సవాలు



గణతంత్ర దినోత్సవం సందర్భంగా భీమిలిలో మాజీ సైనికుల ప్రదర్శన



వెయ్యి అడుగుల జాతీయ జెండా ప్రదర్శనలో వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి తదితరులు



సంతపేటలో గణతంత్ర వేడుకల్లో అక్కరమాని రామునాయుడు తదితరులు

తగరపువలస: గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం మువ్వన్నెల పతాకం వినువీధిలో రెపరెపలాడింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజుగా ఈ వేడుకలు జరుపుకుంటున్నట్టు వక్తలు ఉపన్యాసమిచ్చారు. భీమిలి మండలం కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, లక్ష్మీపురం హైస్కూల్‌లో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, చిప్పాడ హైస్కూల్‌లో సర్పంచ్ వెంపాడ రమావతి, రేఖవానిపాలెంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు పతాకాలను ఆవిష్కరించారు. వేడుకల్లో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్ గాడు వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు తుపాకుల పైడిరాజు, భీమిలి ఎంఈవో కేపీ బాలామణి, ప్రధానోపాధ్యాయులు పాట్నూరు మురళీమోహనరావు, సీహెచ్ రోజామణి, వెంకటలక్ష్మి, వై.జగన్నాథస్వామి, రేక అప్పారావు, గాడు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు. చెరకుపల్లి అవంతి, సంగివలస అనిట్స్, దాకమర్రి రఘు విద్యాసంస్థలు, భీమిలి కేథరిన్ విద్యాసంస్థలు, దివీస్ లేబొరేటరీలో జాతీయ పతాకాలను ఎగురవేశారు.

- జీవీఎంసీ 1, 2 వార్డుల పరిధిలోని పలు సచివాలయాల వద్ద పతాకావిష్కరణ చేశారు. వేడుకల్లో పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, వార్డు అధ్యక్షులు జగుపల్లి ప్రసాద్, చిల్ల భాస్కరరెడ్డి, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ శీరపు అప్పలరెడ్డి, మాజీ కౌన్సిలర్లు ఉప్పాడ నాగేశ్వరరావు, జీవీ రమణ, నాయకులు జీరు సుజాత, చిప్పాడ వెంకటేష్, శిల్లా వంశీ పాల్గొన్నారు. సంగివలస వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి అక్కరమాని మంగరాజు, జీరు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేశారు. వలందపేటలో చిల్ల సూర్యనారాయణరెడ్డి, ఎరుసు అప్పారావు ఆధ్వర్యంలో జీవీఎంసీ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గుజ్జు రామునాయుడు భవన్ వద్ద సీపీఐ జిల్లా నాయకుడు అల్లు బాబూరావు, కొండపు ఈశ్వరరావు పతాకాలు ఆవిష్కరించారు. భీమిలి శ్రీచైతన్య మాజీ సైనికుల సంఘం ప్రదర్శన ఏర్పాటు చేసి పతాకాలు చేతపట్టుకుని మండలమంతా ద్విచక్ర వాహనాలతో ర్యాలీ నిర్వహించారు.

భీమునిపట్నం: భీమిలిలోని క్యాంపు కార్యాలయం వద్ద టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగం వల్ల స్వాతంత్ర్యం రాగా, బీఆర్ అంబేడ్కర్ కృషితో ప్రజలందరికీ సమాన హక్కులతో రాజ్యాంగం లభించిందన్నారు. రాజ్యాంగం అమలైన ఈ రోజుకు ఎంతో ప్రత్యేకత ఉందని, అందరూ దీన్ని గౌరవించాలని కోరారు. ఈ సందర్భంగా వెయ్యి అడుగుల జాతీయ జెండా ప్రదర్శించారు. విద్యార్థులు, మాజీ సైనికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ బొడ్డేపల్లి రాము పాల్గొన్నారు.

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయలో ప్రిన్సిపాల్ కె.సంజయ్ జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 1600 అడుగుల జాతీయ జెండా ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. రుషికొండలోని గిరిజన సాంస్కృతిక పరిశోధన, శిక్షణ సంస్థ భవన్‌లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చిన్నబాబు జాతీయ జెండా ఆవిష్కరించారు. ఉప్పాడ సచివాలయం వద్ద కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు జాతీయ జెండా ఆవిష్కరించారు.

పద్మనాభం: మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రాధ జెండా ఎగుర వేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, తాలాడ పద్మనాభం పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద హెచ్‌డీటీ కిశోర్‌కుమార్ జెండా ఎగుర వేశారు. పాండ్రంగి పంచాయతీ బర్లపేటలోని స్వాతంత్ర్య సమర యోధులు రూపాకుల విశాలాక్షి, సుబ్రహ్మణ్యం స్మృతి వనంలో బీజేపీ వైద్య విభాగం రాష్ట్ర కన్వీనర్ రూపాకుల రవికుమార్ జెండా ఎగుర వేశారు. బీజేపీ నాయకులు ఉప్పాడ అప్పారావు, మహంతి అప్పలరమణ, పాలూరి కృష్ణారావు, హంస మహేష్ పాల్గొన్నారు.

పీఎం పాలెం: బక్కన్నపాలెం 16వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ కొయ్య ప్రవీణ్ కుమార్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి గుడ్ సర్వీస్ ఎంట్రీ సర్టిఫికెట్లు అందజేశారు. ఆసియా స్థాయిలో యోగాలో పతకాలు సాధించిన ఏఎస్ఐ సాగర్‌ను ఘనంగా సన్మానించారు. వీవీవీ సత్యనారాయణ, లక్ష్మీ నారాయణ, డీఎస్పీ మురళీ కృష్ణ పాల్గొన్నారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణ, పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఏసీపీ కుమార స్వామి జాతీయ పతాకం ఎగుర వేశారు. కార్యక్రమంలో సీఐ ఎన్.సాయి, ఎస్ఐ మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం : తమ కార్యాలయాల్లో తహసీల్దార్ లోకవరపు రామారావు, ఎంపీడీవో అడపా లవరాజు, సీఐ రామచంద్రరావు, ఏఈఈ సురేష్ కుమార్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అలాగే సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, వివిధ పాఠశాలలు, కళాశాలలు వద్ద జాతీయ పతాకాలను ఆవిష్కరించి రాజ్యాంగం రచించిన విధానం, అందులోని చట్టాలపై అధికారులు వివరించారు.

వారసత్వ సంపద భావితరాలకు అందించాలి



చంద్రంపాలెం హైస్కూల్‌లో పతాకావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: దేశ సంస్కృతి, సాంప్రదాయాలు, వారసత్వ సంపద భావితరాలకు అందించాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర వేడుకల్లో భాగంగా గురువారం ఆయన త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో మహానుభావులు ఎన్నో త్యాగాలు చేసి దేశానికి స్వాతంత్ర్యం సాధించారన్నారు. ఆ మహనీయుల త్యాగాలను గుర్తించుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు, పిరమిడ్, యోగా తదితర విన్యాసాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిళ్లా సుజాత, వాండ్రాసి శ్యామల, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బుడుమూరి మీనా, పిళ్లా సూరిబాబు, రాజు, ప్రధానోపాధ్యాయులు ఎమ్.రాజబాబు, జయప్రద, పీడీ రాము, పోతిన హనుమంతరావు, గాదే రోశిరెడ్డి పాల్గొన్నారు.

- కొమ్మాది రోడ్డులోని విజయం స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ మాజీ వీసీ ఎమ్.ముత్యాలనాయుడు పతాకావిష్కరణ చేయగా ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు
- జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 కార్యాలయం వద్ద జెడ్సీ కనక మహాలక్ష్మి, అయ్యప్ప నగర్‌లో పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు పతాకావిష్కరణ చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నాగోతి సూర్య ప్రకాశరావు, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.
- స్వతంత్రనగర్‌లో పతాకాన్ని జీవీఎంసీ జోన్ – 2 కమిషనర్ కె. కనక మహాలక్ష్మి ఎగుర వేయగా కార్యవర్గ సభ్యులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



విశేషంగా ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసాలు

- గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వేములవలసలో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు 20 మందికి చీరలు, దుప్పట్లు అందించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జోనల్ అధ్యక్షుడు జంగం జోషి, నాయకులు కనకారావు, నారాయణరావు, సుధాకర్ రెడ్డి, రామ కోటేశ్వరరావు, రమ్య, అశ్విని పాల్గొన్నారు.
- గుడిలోవలోని సరస్వతి విద్యా విహార్‌లో నిర్వహించిన గణతంత్ర దినోత్సవాల్లో భాగంగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, బాల గంగాధర్ తిలక్ వంటి నాయకుల వేషధారణలో బాలలు అలరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నాటకాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ జి.వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణంరాజుపేట యూపీ పాఠశాలలో వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు తదితరులు



బంటుపల్లి వారి కళ్లాలులో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న కమాండెంట్ కొయ్య ప్రవీణ్ కుమార్, సిబ్బంది



ఆదర్శనగర్ వార్డు సచివాలయం వద్ద గణతంత్ర వేడుకల్లో సిబ్బంది



గిరిజన భవన్‌లో గణతంత్ర దినోత్సవాల్లో చిన్నబాబు, సిబ్బంది



ఆనందపురం పోలీస్ స్టేషన్ ఆవరణలో జెండా ఎగురవేస్తున్న సీఐ రామచంద్రరావు



జాతీయ జెండాతో ఎండాడ విద్యార్థుల ర్యాలీ



పద్మనాభం మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాధ

క్లుప్తంగా

మధురవాడ పశువైద్య కేంద్రానికి సంచార అంబులెన్స్



మధురవాడ పశువైద్య కేంద్రం వద్ద సంచార అంబులెన్స్

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోనల్ ఆఫీసు సమీపంలో గల పశువైద్య కేంద్రానికి ప్రభుత్వం వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవ అంబులెన్స్ మంజూరు చేసింది. అలాగే దీనికి అదనంగా మరో వైద్యుడు, సిబ్బంది రానున్నారు. పరదేశిపాలెం నుంచి పెద రుషికొండ, ఎండాడ మధ్య గల భీమిలి నియోజకవర్గం పరిధిలోని పశువులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందనున్నాయి. పశువులకు అత్యవసర వైద్య సేవలు కావాలనుకునే వారు 1962 నంబరులో సంప్రదించాలని వైద్యులు సూచించారు.

ముఠా కలాసీలకు పని భద్రత కల్పించాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న ముఠా కలాసీలు

మధురవాడ: ముఠా కలాసీలకు పని భద్రత కల్పించే పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం రాష్ట్ర ప్రభుత్వం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.మన్మథరావు డిమాండ్ చేశారు. కార్మికుల పలు డిమాండ్స్ సాధన కోసం ఈ నెల 29, 30న తిరుపతిలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ హమాలీ జట్టు ముఠా కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మధురవాడ ఎస్‌బీఐ సమీపంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభల విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. మేస్త్రి ముద్దాడ బంగారయ్య, రెడ్డి, మోహన, రాఘువ, నారాయణరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


విద్య, వైద్యానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ బంగారునాయుడు

తగరపువలస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్దపీట వేశారని భీమిలి వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు అన్నారు. గురువారం మజ్జివలస హైస్కూల్‌లో తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం 8వ తరగతి విద్యార్థులకు విలువైన ట్యాబ్‌లు పంపిణీ చేసిందన్నారు. ఇప్పటికే రెండు విడతలుగా 'నాడు – నేడు' పేరుతో పాఠశాలలను ఆధునీకరించి వసతులు కల్పించామన్నారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం కూడా అందిస్తున్నామన్నారు. సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, తుపాకుల అప్పలరాజు, నీలాపు సూర్యనారాయణరెడ్డి, బోని శివ, ప్రధానోపాధ్యాయుడు మురళీమోహన్ పట్నాయిక్ పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



దివ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు రాయపాలెం హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని దివ్యను గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు జయంతి రాధాకుమారి, ఉపాధ్యాయురాలు శైలజ అభినందించారు. బుధవారం జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయిలో దివ్య కలెక్టర్ చేతుల మీదుగా మెమెంటో, ప్రశంసా పత్రం అందుకుంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శిల్లా వంశీరెడ్డి, చిల్ల సూర్యనారాయణరెడ్డి, శీరపు శ్రీరాములు, కంచుబోయిన వెంకటరావు, బొండా కిరణ్ అభినందించారు.

వైభవంగా వసంత పంచమి పూజలు



పిల్లలతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు



ప్రత్యేక అలంకరణలో శారదాంబ అమ్మవారు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లో గల శ్రీ అష్టలక్ష్మి దేవాలయంలో గురువారం వసంత పంచమి పర్వదినాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ముందుగా విద్యాలక్ష్మి అమ్మవారిని సరస్వతి దేవిగా అలంకరించి పలు ప్రత్యేక పూజలు, పారాయణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తదితరులు పాల్గొన్నారు.

శారదాంబకు విశేష పూజలు

పీఎం పాలెం: పీఎం పాలెం – బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువుతీరిన శ్రీ శారదాంబ అమ్మవారికి వసంత పంచమి సందర్భంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. మఠం గౌరవ పరిపాలన అధికారి జె.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

గుడిలోవలో సామూహిక అక్షరాభ్యాసాలు

ఆనందపురం : మండలంలోని గుడిలోవలో ఉన్న సరస్వతి విద్యావిహార్‌లో గురువారం వసంత పంచమి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 27 మంది పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పాఠశాల ఆవరణలో సరస్వతి అష్టోత్తరం పూజ, హోమం నిర్వహించారు. కార్యక్రమంలో సైంటిస్ట్ పి.వెంకట వైదేహి, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీచర్ మందలించారనే బలవన్మరణం

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ చైతన్య కళాశాలలో బుధవారం సాయంత్రం విద్యార్థిని అనూష ఆత్మహత్యకు టీచర్ మందలించడమే కారణమని భీమిలి సీఐ లక్ష్మణమూర్తి తెలిపారు. చైతన్య కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అనకాపల్లి జిల్లా మునగపాకకు చెందిన విద్యార్థిని అనూష యాదవ్(17) బుధవారం కాలేజీ హాస్టల్‌లో ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు ఓ సూసైడ్ నోట్ లభించింది. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... నిట్ ప్రిపరేషన్ కోసం కళాశాలలో ప్రతీ వారం పరీక్ష పెడుతుంటారు. ఈ క్రమంలో ఈ నెల 23న కెమిస్ట్రీ పరీక్ష నిర్వహించారు. అయితే అనూష పరీక్ష ఆలస్యంగా రాయడంతో కెమిస్ట్రీ టీచర్ తోటి విద్యార్థుల ముందు ఆమెను మందలించడంతో మనస్తాపానికి గురై సూసైడ్‌నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. గురువారం రిపబ్లిక్ డే సెలవు కావడంతో శుక్రవారం కళాశాలలో పూర్తి వివరాలు సేకరిస్తామని, ఇప్పటికే కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు సీఐ తెలిపారు.

బాలికల వసతి గృహాల పరిశీలన

భీమునిపట్నం: భీమిలిలోని బాలికల గురుకుల, సాంఘిక సంక్షేమ గురుకులాల వసతి గృహాలను గురువారం బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు పరిశీలించారు. ఈ సందర్భంగా బాలికలతో మాట్లాడి ఇక్కడ కల్పిస్తున్న వసతులపై తెలుసుకున్నారు. శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ దంపతుల సేవలకు సత్కారం



రమేష్, ప్రశాంతి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: సామాజిక, హోమియో, విద్యారంగంలో అందిస్తున్న సేవలకు సంతపేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు డబ్బీరు రమేష్, ప్రశాంతి దంపతులను గురువారం ఘనంగా సత్కరించారు. అంబేడ్కరు పాఠశాలలో ఉపాధ్యాయునిగా విధులు నిర్వర్తిస్తున్న రమేష్, హోమియో వైద్యం ద్వారా కూడా సేవలు అందిస్తున్నారన్నారు. ఏపీ శిష్టకరణాల సంఘం మహిళా అధ్యక్షురాలిగా ప్రశాంతి ఇటీవల పదో తరగతి పరీక్షలలో ఉత్తీర్ణులైన పలువురికి ఆర్థిక సాయంతో పాటు స్టేషనరీ, వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి, ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, స్కూల్ కమిటీ చైర్మన్ డి.రాంబాబు సన్మానించారు.

యువతి ఆత్మహత్య

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మూడు నెలల కిందట ప్రేమ వివాహం చేసుకున్న సంధ్య, శ్రావణ్ కుమార్ మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో కాపురం పెట్టారు. వీరి ఇంటికి సమీపంలోనే సంధ్య తల్లి వెంకట లక్ష్మి కుటుంబంతో నివసిస్తోంది. బుధవారం తల్లితో కలిసి సంధ్య తన సోదరి వివాహ కార్డు లు పంచడానికి వెళ్లింది. తిరిగి అదే రోజు రాత్రి 9 గంటలకు వచ్చింది. ఆ సమయంలో మరో వ్యక్తితో భర్త శ్రావణ కుమార్ కలిసి ఉన్నాడు. ఈ విషయమై ఇద్దరికీ గొడవ జరిగింది. అనంతరం భర్త ఇంటి నుంచి వెళ్లిపోగా ఫ్యానుకు ఉరి వేసుకుని సంధ్య ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పీఎం పాలెం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సునీత తెలిపారు.

నూకాలమ్మ ఉత్సవ కమిటీ

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవ కమిటీ గురువారం ఎన్నికైంది. అధ్యక్షునిగా వాసుపల్లి ఎల్లాజీరావు, ప్రధాన కార్యదర్శిగా రాంభక్త ప్రభాకర్ నాయుడు, కోశాధికారిగా కాసరపు పెద ఎల్లాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నమ్మి శేషాద్రి, కో ఆర్డినేటర్‌గా ముమ్మిడిశెట్టి సునీల్ ఎన్నికయ్యారు.

హామీలన్నీ నెరవేర్చిన సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన అన్ని హామీలన్నీ నెరవేర్చారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 3వ వార్డులోని నర్సింహస్వామి ఆలయం, గొల్లవీధి, మంగలవీధి, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రజలకు ఏం చేయనున్నారో జగన్ వివరంగా చెప్పారని... సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సకాలంలో హామీలన్నీ అమలు చేశారన్నారు.

కరోనాతోపాటు ఇతర ఎన్ని అడ్డంకులు వచ్చినా వాటిని సమర్థంగా ఎదుర్కొంటూ పాలన సాగిస్తున్నారని కొనియాడారు. అభివృద్ధి కార్యక్రమాలు కూడా పెద్ద ఎత్తున జరుగుతున్నాయని, అనేక కంపెనీలు, పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని... తద్వారా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతిపక్షాలకు ఏం చేయాలో అర్థం కావడంలేదని, అందుకే అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని విధాలుగా తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలంతా సీఎం జగన్ పక్షానే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆయన ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో తాగునీరు, కాలువలతోపాటు ఇతర సమస్యలను ఆయన దృష్టికి స్థానికులు తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్లు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.